క్లుప్తంగా

రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే



సింగిరెడ్డిపల్లి, భూపతిరావుపేట రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పినపాక: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న సింగిరెడ్డిపల్లి, భూపతిరావుపేట ప్రధాన రహదారిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి త్వరలోనే రహదారి మరమ్మతులకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అవినీతికి తావు లేకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ అక్షింతలు



అశ్వాపురం: అక్షింతల పంపిణీలో ఎంపీపీ, భక్తులు

అశ్వాపురం: అయోధ్య నుంచి వచ్చిన రామ సేవిత అక్షింతలను మండల కేంద్రంలో రామాలయంలో పూజా కార్యక్రమాల అనంతరం అశ్వాపురం గ్రామంలో మంగళవారం గడప గడపకూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, శ్రీ రామ భక్త హనుమాన్ బృందం, భక్తులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక, గుమ్మడవల్లి, కొత్తూరు, అశ్వారావుపేట తోపాటు పలు గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను విశ్వ హిందూ పరిషత్, భక్తుల ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా ఆలయాల్లో అక్షింతలకు అర్చకుల సమక్షంలో కలశ పూజలు నిర్వహించారు.

5వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్

అశ్వాపురం: ఈ నెల 5 నుంచి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య సహకారాలతో మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం వద్ద అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో 13వ అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, షీల్డ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.వెయ్యి, షీల్డ్ అందిస్తామన్నారు. ప్రతీ మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 7569410477, 6305289361, 7569697393,9381842460 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

ములకలపల్లి: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని తెలంగాణా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మూకమామిడిలో మంగళవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘ జనరల్‌బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. సంక్షేమబోర్డులో ప్రసూతి కానుక రూ.లక్ష, వివాహ కానుక రెండు లక్షలకు పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల అర్జున్, మండల కన్వీనర్ నిమ్మల మధు, భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఉప్పతల నర్సింహారావు, నాయకులు అంజమ్మ. ఓరుగంటి శ్రీను. సూరం పుల్లారావు, కోండ్రు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

దమ్మపేట: పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఉపాధ్యాయుడికి, పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కత్తుల సతీష్, ఇటీవలే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో, ఎమ్మెస్సీ జువాలజీ విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు గాను యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ పొందాడు.

ఈ సందర్భంగా మంగళవారం దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఆ ఉపాధ్యాయుడు కత్తుల సతీష్‌ను, ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు మస్తాన్‌వలీ, జగదేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పీఠం ఎవరిదో!?

- కొత్త ప్రభుత్వంలో కొలువుదీరనున్న కమిటీ పాలకవర్గం
- ఏడేళ్లుగా చక్రం తిప్పిన బీఆర్ఎస్ నేతలు
- ఆశల పల్లకీలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు



కొత్త మార్కెట్ కమిటీ పాలకవర్గం కోసం ఎదురు చూస్తున్న చర్ల మార్కెట్ కమిటీ కార్యాలయం

చర్ల: తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ హస్తం నేతల నేతుల్లోకి రానుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో క్షుత్రస్థాయిలో పని చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడంతో ఇకపై తమకు దక్కాల్సిన నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టిసారిస్తున్నారు. పంచాయతీ, మండల స్థాయిలో ఉండే ప్రొటోకాల్ పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పదేళ్ల కాలం పాటు తాము పార్టీనే పట్టుకొని కష్ట కాలంలో కూడా పని చేశామని ఇప్పుడు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి నామినేటెడ్ పద్ధతిలో వచ్చే పదవులతో తమకు న్యాయం చేయాలంటూ పలువురు నాయకులు పార్టీ పెద్దల వద్ద తమ వాదనలను వినిపించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

కొలువుదీరనున్న కొత్త పాలకవర్గం..

ఏడేళ్ల పాటు మార్కెట్‌కమిటీలు బీఆర్ఎస్ నేతల చేతుల్లోనే కొనసాగాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకోవడంతో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో న్న పలు నామినేటెడ్ పోస్టులు కాంగ్రెస్ నేతల చేతుల్లోకి రానున్నాయి. ముఖ్యంగా నామినేటెడ్ పదవులతో కూడిన నూతన మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమవ్వడంతో కాంగ్రెస్ నేతలు ఆశలు పెంచుకుంటున్నారు. ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నాయకులు తమను ఎంపిక చేయాలంటే తమను ఎంపిక చేయాలంటూ పార్టీ పెద్దల వద్ద ఈ ప్రస్తావనలను తీసుకొస్తున్నట్లు సమాచారం. మార్కెట్ కమిటీలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన 10 మందితో పాలకవర్గాన్ని వ్యవసాయశాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరుగనుంది.

కమిటీ ఎంపిక ఇలా..

రైతాంగానికి అనుబంధంగా ఉండే వ్యవసాయ మార్కెట్ కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మార్కెట్ లైసెన్సులు కలిగిన ఇద్దరు వ్యాపారులను కమిటీలో డైరెక్టర్లుగా నియమిస్తారు. మరో ఆరుగురు వ్యవసాయ రంగంలో అనుభవం కలిగిన వారిని డైరెక్టర్లుగా ఎంపిక చేస్తారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన అధికారులు, మంత్రుల సూచనల మేరకు ఈ కమిటీని ఎంపిక చేస్తే దానిని వ్యవసాయశాఖ మంత్రి ఫైనల్ చేస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మార్కెట్ కమిటీలోని పదవుల కోసం నాయకులు ఎవరికి వారుగా గోప్యంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఎవరి దారిన వారు..

చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలో నామినేటెడ్ పోస్టులు దక్కించుకునేందుకు ఎవరికి వారుగా పైరవీలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిదిలో పూర్వపు నూగూరు తాలూకాలో ఉన్న చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలు ఉన్నాయి. అయితే మార్కెట్ కమిటీ పరిదిలో ఉన్న ఈ మూడు మండలాల పరిదిలో ఉన్న కాంగ్రెస్ నేతలు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం ఎవరికి వారుగా పైరవీలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చర్ల మార్కెట్ కమిటీ యోగం ఎవరికి వరించేనోనని మార్కెట్ కమిటీ పరిధిలోని ప్రజానీకం ఎదురు చూస్తున్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళవారం మండలంలోని పట్వారిగూడెం, మల్కారం, మందలపల్లి, దమ్మపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజా పాలన దరఖాస్తు వివరాలను నమోదు చేస్తున్న రికార్డులను తనఖీ చేశారు. రికార్డుల్లో చేస్తున్న చిన్న చిన్న తప్పులను సిబ్బందికి చూయించి, వాటిని సరిచేసుకోవాని సూచించారు. అంతకు ముందుగా పట్వారిగూడెం గ్రామంలో ఆర్టీసీ బస్సు ఎక్కి, మహిళ ప్రయాణీకులతో ఉచిత బస్సు ప్రయాణంపై ముచ్చటించారు.

పలువురికి పరామర్శ

పట్వారిగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వాసం పెద్దశ్రీనును పరామర్శించారు. తాళ్లమడ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తుర్రం బుల్లెమ్మను పరామర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, చామర్తి గోపిశాస్త్రి, పర్వతనేని ప్రసాద్, రావు రవిశంకర్, కేవీ సత్యనారాయణ, రొయ్యల కుమార్, చక్కిరాల మల్లేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న నాయకులు

గుండాల: టాటా మ్యాజిక్, ఆటో డ్రైవర్స్ ఓనర్స్‌కు సమగ్ర న్యాయం చేయాలని ఆళ్లపల్లి వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి సద్దాంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఆటో, మ్యాజిక్ ఓనర్స్‌కు సమగ్ర న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌కు వినతీపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలలో భాగంగా మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించడంతో తమకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కొనుగోలు చేసుకున్న వాహనాలకు కిస్తీలు కూడా వెళ్లడం లేదని వాపోయారు. నెలకు రే. 15వేల చొప్పున జీవన భృతి కల్పించాలని, ఆరోగ్య బీమా వర్తింప చేయాలని, టాటా మ్యాజిక్‌లకు ట్యాక్సీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రహీం, డౌలత్, నగేష్, కృష్ణ, యాకయ్య, ఖుద్రత్, ప్రభాకర్, చిరంజీవి, సర్వేష్, సాంచి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా నెహ్రూకప్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న నెహ్రూకప్ అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన రెండు మ్యాచ్‌లలో గెలుపొందిన కుంట(ఛత్తీస్‌గఢ్), వైఎమ్‌సీసీ ఇల్లందు జట్లు క్వార్టర్ ఫైనల్‌కి చేరాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో న్యూ స్టార్స్ జట్టుపై వైఎమ్‌సీసీ ఇల్లెందు జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో కుంట స్పోర్ట్స్ క్లబ్ (ఛత్తీసగఢ్), భద్రాచలం ఫుట్ బాల్ క్లబ్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కుంట స్పోర్ట్స్ క్లబ్ జట్టు 149 పరుగులు చేసింది. లక్ష్య చేదనలో భద్రాచలం ఫుట్ బాల్ క్లబ్ జట్టు 82 పరుగులకే కుప్పకూలడంతో కుంట స్పోర్ట్స్ క్లబ్ 67 పరుగులతో గెలుపొందింది. ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులకు మొదటి మ్యాచ్‌లలో వెంకట శావ చరణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను హరిచంద్ర నాయక్, రెండో మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను ఆకాశ సింగ్‌కు అజీమ్ అందజేశారు. కార్యక్రమంలో బాలయోగి, సలీం, నాగార్జున, సదానందం, శ్రీనివాస్, పాషా సలీమ్, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీ-హబ్ పరీక్షల తేదీలివే..

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు, పర్ణశాల, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో జనవరి నెలలో టీ-హబ్ ద్వారా నిర్వహించే పరీక్షల తేదీలను డాక్టర్ పుల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 4, 6, 9, 11, 16, 18, 20, 23, 25, 27, 30 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డులను తమ వెంట తీసుకుని రావాలని సూచించారు.

నేడు జీయర్ స్వామి రాక

చర్ల: మండల కేంద్రంలోని పాతచర్లలో ఉన్న శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి ఆలయానికి బుధవారం త్రిదండి దేవనాథ జీయర్ స్వామి రానున్నారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ బాధ్యులు వెల్లడించారు. ఉదయం 10గంటలకు చర్లకు చేరుకోనున్న స్వామికి స్వాగతం పలికేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

లిఫ్ట్ పనులు పూర్తి చేయాలి

దుమ్ముగూడెం: మండల ప్రజలు ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న ప్రగల్లపల్లి లిఫ్ట్ పనులు ప్రస్తుత భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాయంలోనే పూర్తి అయ్యేలా చూడాలని ఏఎస్పీ జిల్లా కమిటీ అధ్యక్షుడు తెల్లం నరసింహారావు అన్నారు. మంగళవారం మారేడుబాక గ్రామంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. ప్రగల్లపల్లి లిఫ్ట్ నిర్మాణం జరిగితే బట్టిగూడెం, దబ్బనూతులా, కొత్తూరు, కమలాపురం, ఆర్లగూడెం, ఎర్రబోరు, అడవిరామరం, లచ్చిగూడెం, మారాయిగూడెం, భీమవరం, కోయనర్సాపురం, రామచంద్రునిపేట, చెరుపల్లి, కొత్తపల్లి, కొమ్మానాపల్లి గ్రామాల్లోని ఆదివాసీ అన్నదాతలకు చాలా ఉపయోగకరం అన్నారు.

అడ్వకేట్ జనరల్‌కు శుభాకాంక్షలు



అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదులు

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా నియమితులైన ఏ.సుదర్శన్ రెడ్డిని మంగళవారం భద్రాచలానికి చెందిన హైకోర్టు న్యాయవాది పీవీ కృష్ణమాచారి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి శాలువాతో సుదర్శన్ రెడ్డిని సత్కరించి, రాముల వారి ప్రతిమను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు న్యాయవాదులు మరగాని కృష్ణ, ముత్యాల ప్రవీణ్, సనబేగంలు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బందిపెట్టొద్దు

మణుగూరురూరల్: ఆర్థిక లావాదేవీల విషయంలో సింగరేణి కార్మికులను, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధిక ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్న కార్మికులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడంతో పాటు నూతనం సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. సంస్థలో సుదీర్ఘకాలం పని చేసి పదవీ విరమణ చేసిన కార్మికులు ఏరియర్స్, ఇతర ఆర్థిక లావాదేవీల విషయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బి.రాజలింగు, డీవీవీ సత్యనారాయణ, పి.ముత్తేశ్వరరావు పాల్గొన్నారు.

పొదెం జన్మదిన వేడుకలు



దుమ్ముగూడెం: ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చర్ల: మాజీ మ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య జన్మదిన వేడుకలు మంగళవారం చర్లలో ఘనంగా జరిగాయి. పార్టీ మండల అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో చర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ సభ్యులు మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాదరావు, చర్ల సహకార సంఘం అధ్యక్షుడు డీసీఎంఎస్ డైరెక్టర్ పరుచూరి రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జెడ్పీటీసీ సభ్యురాలు చీమలమర్రి మురళీకృష్ణ, దేవభక్తుని రామకృష్ణ, బండిరు రామకృష్ణ, కారంపూడి సాల్మన్‌రాజు, సుందరి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి.. ములకపాడు వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంక అబ్బులు, నాయకులు బైరెడ్డి సీతారామారావు, శిరపు అప్పల రెడ్డి,పిలక వెంకటరమణారెడ్డి, దర్శి సాంబశివరావు, అన్నె నారాయణమూర్తి, జిలకర వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, తెల్లం హరికృష్ణ, జిల్లా సోషల్ మీడియా చైర్మెన్ కనుబుద్ది దేవా, లంక శివ, డింగి సందీప్ రెడ్డి, సర్పంచ్ వర్ష చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు బోనగిరి శివసైదులు, కుంభ అంజయ్య, హుస్సేన్, మహిళా నాయకులు శాంతికుమారి, రాధా, ఉపేంద్ర, యువజన నాయకులు ప్రేమ్‌కుమార్, నాగరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే ఏఐటీయూసీ ధ్యేయం



రాంగోపాల్‌ను సన్మానిస్తున్న కార్మికులు

మణుగూరురూరల్: కార్మిక సంక్షేమమే ఏఐటీయూసీ ధ్యేయమని ఆ సంఘం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఎన్నిక కావడంపై మంగళవారం కొండాపురం భూగర్భగనిలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపు కార్మికుల విజయమని, భవిష్యత్తు కార్మికులదేనని అన్నారు. కార్మికుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు యూనియన్ కట్టుబడి ఉందన్నారు. అనంతరం రాంగోపాల్‌ను కార్మికులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం న్యూఇయర్ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లు, రక్షణ అధికారి మధుబాబు, ఏఐటీయూసీ నాయకులు మల్లెల రామనర్సయ్య, ఆవుల నాగరాజు, సురేందర్, ఆంథోని రవికుమార్, కోడిరెక్కల శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను అందుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

బూర్గంపాడు: ఇష్టపడి చదువుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని బూర్గంపాడు ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ బహుమతి ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో శ్రద్ధగా చదువుకుంటే జీవితంలో ఉత్తమంగా రాణించవచ్చాన్నారు. బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బి.నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని మానసేవ వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పుట్టినరోజు సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు భోజనంతో పాటు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరెళ్ళ నరేష్, సత్య లింగం, నరసింహారావు, వెంకటేష్, కోటేష్, ప్రసన్నకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన

గ్రామాలు, పట్టణాల్లో మంగళవారం ప్రజాపాలన కొనసాగింది. ఆదివారం, జనవరి ఫస్ట్ సందర్భంగా రెండు రోజులు విరామం అనంతరం తిరిగి సభ నిర్వహించారు. ప్రజల నుంచి ఆయా ప్రాంతాల్లోని అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి దరఖాస్తులను అందించారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమాలను సందర్శించి దరఖాస్తు స్వీకరణ తీరును పర్యవేక్షించారు. పలు సలహాలు సూచనలు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: దరఖాస్తులు అందించేందుకు క్యూ కట్టిన ప్రజలు



భద్రాచలంటౌన్: గ్రామసభ వద్ద దరఖాస్తుల తీరును పరిశీలిస్తున్న ఆర్డీఓ మంగీలాల్



పెద్దిరెడ్డిగూడెంలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న డీపీఓ రమాకాంత్



చర్లరూరల్: ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



అన్నపురెడ్డిపల్లిలో దరఖాస్తులు స్వీకరణను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారిణి మాధవి



అశ్వాపురం: మొండికుంటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ ముత్తినేని సుజాత



గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామ సభలో ప్రజలు